
# సత్యవాక్యం

# THE WORD OF TRUTH



## క్రైస్తవ మాసపత్రిక

**JULY 2005**

# సత్యవాణి - క్రీస్తు సంఘము

# నిర్వహించు గొప్ప బైబిల్ లెక్చర్‌షిప్

**2005 సెప్టెంబరు 15, 16, 17 తేదీలలో**

స్థలం : అంబేద్కర్ భవన్, పాతబస్టాండు దగ్గర,
(జిల్లా కోర్టు కాంప్లెక్సుకు ఎదురుగా),
కాకినాడ - 1.

సమయం : 10.00 a.m., 2.00 p.m. & 6.00 p.m.

ప్రసంగీకులు : Bro. Ken Yearwood, USA.
Bro. Jack Thibodaux, USA.
Bro. Paul Jones, USA.
Bro. Joshua Gootam &
Bro. Ricky Gootam.

మరియు గొప్ప అనుభవజ్ఞులైన దైవసేవకులు దేవుని వర్తమానము నందించుదురు. ఈ కూటములకు అందరు ఆహ్వానితులే. ఈ కూటములకు మిమ్ములను ప్రేమ పూర్వకముగా ఆహ్వానించుచున్నాము. మీ కుటుంబ సమేతముగా వచ్చి ఆత్మీయ మేలులు పొందండి. దేవుని వాక్యములోని గొప్ప సత్యములను తెలిసికొనండి.

సత్యవాణి టి.వి. కార్యక్రమమును ప్రతి శనివారం "తేజ" లోను, ప్రతి మంగళవారం "మా" టివిలోను ఉదయం 6.30 గంటలకు తప్పక చూడండి.

వందనములతో

బ్రదర్ జాషువా గూటం

ఫోన్ : 0884 - 2363722
2363697

SATYA VANI
P.O. Box. 80
KAKINADA - 533 001.

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH



P.O. Box-80, Kakinada, A.P. 533 001
Ph : 0884 - 2363722
Editor :
**Joshua Gootam**



*Pleading for Restoration of First Century Christianity*

సంపుటిక 25 | జూలై 2005 | సంచిక 12


# దేవుని రాజ్యములో యున్న దీవెనలు

## (Blessings within the Kingdom)

యేసుక్రీస్తు స్థాపించిన రాజ్యము ఇహలోక సంబంధమైనది కాదు. గాని అది ఒక ఆత్మీయ రాజ్యమని ఇదివరకే మనము గమనించి యుంటిమి. దేవుని రాజ్యములో యుండుట వలన కలుగు దీవెనలను గూర్చి ఇప్పుడు తెలిసి కొందాము. ఒక దేశములో యున్న పౌరుడు ఆ దేశము ఇచ్చు హక్కులను వినియోగించుకొను తరుణమును అతడు మాత్రమే కలిగియున్నాడు గాని వేరొక దేశీయుడు కాదు. అట్లే క్రీస్తు రాజ్యములో యున్న దీవెనలను, ఆ రాజ్యములో యున్నవాడే పొందగలడు గాని వేరొకడు కాదు గదా. రక్షింపబడిన ప్రతివారును క్రీస్తు రాజ్య పౌరులని మన మెరుగుదుము. గనుక యేసు క్రీస్తు ఇచ్చు దీవెనలు క్రైస్తవులకు మాత్రమే వర్తించును.

క్రైస్తవులను క్రీస్తు సంఘ మనియు, క్రీస్తు రాజ్యమనియు, క్రీస్తు శరీర మనియు, దేవుని కుటుంబమనియు దైవ వేదము పిలుచుచున్నది. ఆ పదములు

దేవునికి క్రైస్తవులకు యున్న ప్రత్యేక సంబంధమునువర్ణించుట కుపయోగింప బడినవి. అయితే ఈ పదముల ద్వారా రక్షింపబడిన వారి కనుగ్రహింపబడు దీవెనలను మనము న ం లభ్ వము గా గ్రహించగలము. ఉదాహరణకు, క్రైస్తవులు క్రీస్తు రాజ్యమని పిలువబడియున్నారు. అట్లయిన క్రీస్తే వారి ఆత్మీయ రాజు అయియున్నాడు. అపొ.పౌలు ఈ సంగతిని కొలస్స 1:13, 14లో ఇట్లు వ్రాయుచున్నాడు. "ఆయన మనలను అంధకార సంబంధమైన అధికారములో నుండి విడుదలచేసి, తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్యని వాసులనుగా చేసెను.

ఆ కుమారుని యందు మనకు విమోచనము అనగా పాపక్షమాపణ కలుగుచున్నది".

యేసుక్రీస్తు రక్తము ద్వారా పాపక్షమాపణ నొందినవాడు అంధకార సంబంధమైన అధికారము నుండి, అంటే పాపపు బానిసత్వము నుండి విడుదల చేయబడి యేసుక్రీస్తు యొక్క రాజ్యపౌరుడగును. క్రీస్తు రాజ్యములో యున్నవారు పాప విమోచనము నొంది దీవించబడిన వారవుదురు. అంటే క్రీస్తు యేసునందున్న ఆత్మీయయీవులన్నియు క్రీస్తు రాజ్యపౌరుల వగును. క్రీస్తు రాజ్య పౌరుడెవడయినను పాపము చేసిన యెడల అతడు మారుమనస్సును వ్యక్తపర్చుచూ రాజైన క్రీస్తు సన్నిధికి ప్రార్థించుచూ వచ్చిన యెడల, యేసుక్రీస్తు అతనిని తప్పక క్షమించును. "ఆయన వెలుగులో నున్న ప్రకారము మనమును వెలుగులో నడిచిన యెడల మనము అన్యోన్య సహవాసము గలవారమై యుందుము. అపుడు ఆయన కుమారుడైన యేసు రక్తము ప్రతి పాపము నుండి మనలను పవిత్రులనుగా చేయును .... మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:7-9).

క్రీస్తు రాజ్యమే క్రీస్తు సంఘమని దైవవేదము ప్రబోధించుచున్నది. సంఘము అను పదము "ఎక్లీషియా" అను గ్రీకు పదము నుండి వచ్చినది. ఎక్లీషియా అనగా పిలువబడిన వారు, ఒక సమాజము లేక సంఘము అని అర్థము.

ఈ లోకముతో మిళితమై యుండకుండు నిమిత్తము దేవుడు ప్రజలను సువార్త ద్వారా పిలిచి ప్రత్యేక పరుచుచున్నాడు. అట్లు పిలువబడిన వారిని ఆయన తన సంఘమందుంచుచున్నాడు. క్రీస్తు సంఘమందున్న ప్రతివారును ఆత్మీయ ఐక్యత కలిగియున్నారు. "నా సంఘమును నేను కట్టుదును" అని క్రీస్తు వాగ్దానము చేసి (మత్తయి 16:18), దానిని ఆయన నిర్మించెను. క్రీస్తు సంఘము స్థాపించబడిన నాటినుండి నేటివరకును రక్షింపబడిన ప్రతివారినీ ప్రభువు తన సంఘముతో చేర్చుచున్నారు.

మొదటి క్రైస్తవులు "ఆనందముతోను, నిష్కపటమైన హృదయముతోను, ఆహారము పుచ్చుకొనుచుండిరి. మరియు ప్రభువు రక్షణ పొందుచున్న వారిని అనుదినము వారితో (అనగా సంఘముతో) చేర్చుచుండెను" (అపొ.కా.2:47). క్రీస్తు రక్తము ద్వారా కడుగబడి రక్షింపబడిన ప్రతివానిని దేవుడు తన బిడ్డగా తన సంఘమందు లెక్కించును. "యేసుక్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొని యున్నారు. ఇందులో యూదుడని గ్రీసు దేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడనిలేదు, పురుషుడని స్త్రీ అని లేదు, యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు", అని గలతీయలో యున్న క్రైస్తవులకు పౌలు బోధించెను (గలతీ 3:26-28).

రక్షింపబడిన ప్రతివారిని ప్రభువు తన సంఘముతో చేర్చుచున్నాడు. సంఘములో యున్న ప్రతివారును దేవుని కుమారులై యున్నారు. క్రీస్తు సంఘములో లేనివారు దేవుని బిడ్డలుగా పరిగణింపబడరు. రక్షింపబడవలెనంటే సంఘమునందు ఉండనవసరం లేదు అని అనేకులు తలంచవచ్చును. గాని నిజంగా చూస్తే రక్షింపబడినవారే క్రీస్తు సంఘమైయున్నారు. రక్షింపబడి సంఘములో లేకుండా యుండుట ఎంత అసాధ్యమో రక్షింపబడినవారు సంఘము వెలపల యుండుట అంత అసాధ్యము.

క్రీస్తు సంఘమే క్రీస్తు శరీరమై యున్నదని దైవవేదము చెప్పుచున్నది. మన భౌతిక శరీర మొక్కటే అయినను అందు అనేక అవయవములు ఎట్లున్నవో, దానికి శిరస్సు కూడా ఒక్కటే ఎట్లున్నదో

అట్లే క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరము కూడాను. "అటువలె మీరు క్రీస్తు యొక్క శరీరమై యుండి వేరువేరుగా అవయవములై యున్నారు'' అని కొరింధీలోని క్రైస్తవులను అపొ.పౌలు హెచ్చరించెను (1 కొరింధి 12:27). "మరియు సమస్తమును ఆయన పాదముల క్రింద ఉంచి సమస్తము పైని ఆయనను సంఘమునకు శిరస్సుగా నియమించెను. ఆ సంఘము ఆయన శరీరము, సమస్తమును పూర్తిగా నింపుచున్న వాని సంపూర్ణతయై యున్నది" అని ఎఫెసీ 1:22-23 చెప్పుచున్నది.

మన శరీరములోని రక్తము మనకు జీవము నిచ్చును. రోగములను నివారించుచు, గాయములను ఎట్లు పూడ్చుచుండునో అట్లే క్రీస్తు యొక్క పరిశుద్ధ రక్తము మన ఆత్మలను ప్రతినిత్యము కడిగి పవిత్రముగా నుంచును. రక్షణ క్రీస్తు నందుండుట నిజమే గాని రక్షణ యను ఈ దీవెన ఆయన సంఘమునందున్న వారికి మాత్రమే వర్తించునని ఆయన నిర్ణయించెను.

ఎఫెసులో యున్న క్రీస్తు సంఘ పెద్దలతో అపొ.పౌలు మాట్లాడుచు, "దేవుడు తన స్వరక్త మిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మిమ్మును దేని యందు అధ్యక్షులనుగా ఉంచెనో ఆ యావత్తు మందను గూర్చియు, మీ మట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి'' యని హెచ్చరించెను (అపొ.కా. 20:28), క్రీస్తు, సంఘమును తన స్వరక్తమిచ్చి సంపాదించెను గనుగ క్రీస్తు రక్తము ద్వారా అనుగ్రహింపబడు రక్షణ యను దీవెనను పొందు నిమిత్తము ఒకడు క్రీస్తు సంఘ మందుండి ఆయనకు నమ్మకముగా జీవించవలెను.

క్రీస్తు సంఘమే దేవుని కుటుంబము లేక దేవుని గృహమని దైవవేదము బోధించుచున్నది. నీటి మూలముగాను, ఆత్మమూలముగాను క్రొత్తగా జన్మించినవారు అందుంటారు (యెహాను 3:5). అందువలన వారు దేవుని కుమారులు, కుమార్తెలు అగుదురు. "దేవుని ఆత్మచేత ఎందరు నడిపింపబడుదురో వారందరు దేవుని కుమారులై యుందురు ... ... మనము దేవుని పిల్లలమని ఆత్మ తానే మన ఆత్మతో కూడ సాక్ష్యమిచ్చు చున్నాడు.

మనము పిల్లలమయితే వారసులము, అనగా దేవుని వారసులము, క్రీస్తుతో కూడ మహిమ పొందుటకు ఆయనతో శ్రమపడిన యెడల, క్రీస్తుతోడి వారసులము" అని అపొ.పౌలు రోమాలోని క్రైస్తవులను హెచ్చరించెను (రోమా 8:14-17).

దేవుని యొక్క ఈ ఆత్మీయ గృహమందు దేవుడు మనకు తండ్రియై యుండగా, యేసుక్రీస్తు మన పెద్ద అన్నయైయున్నాడు. అందువలననే "మీరు భూమి మీద ఎవనికైనను తండ్రి అని పేరు పెట్టవద్దు, ఒక్కడే మీ తండ్రి ఆయన పరలోకమందున్నాడు" అని మత్తయి 23:9లో యేసుక్రీస్తు బోధించెను. దేవునికి వర్తించు తండ్రి అను ఈ పేరును ఈనాడు కేథలిక్కు స్వాములు, డినామినేషన్ల బోధకులు అనేకులు ధరించుట చాల విచారకరమైన విషయము. వారిని అట్లు పిలుచుట యేసుక్రీస్తు బోధను వ్యతిరేకించుటయే.

దేవుని గృహమైన సంఘములో క్రొత్తగా జన్మించిన వారుందురు. వారు మాత్రమే నిత్య జీవమునకు వారసులగుదురు. తండ్రియైన దేవుని కుమారులు కాని వారికి ఆయన తన స్వాస్థ్యము నెట్లు పంచియిచ్చును ?

గనుక క్రీస్తు ద్వారా దేవుడిచ్చు నిత్య జీవమును సంపాదించుకొనవలెనని నీవు ఆశించుచున్న యెడల నీవు క్రీస్తు సంఘమందుండుట అత్యవసరము.

దేవుడిచ్చు దీవెనలన్నియును ఆయన తన సంఘమందున్న వారి కొరకు ప్రత్యేకపరచి యున్నాడని మనము గమనించితిమి. క్రీస్తు సంఘము యొక్క పరిపూర్ణ నమూనాను దేవుడు క్రొత్త నిబంధన యందు మనకొరకు వ్రాయించి యిచ్చెను. మొదటి శతాబ్దములో పరిశుద్ధాత్మావేశము కలిగినవారిచే దేవుడు ఈ గ్రంథమును తన బిడ్డల కొరకు వ్రాయించెను. (2 పేతురు 1:21). క్రీస్తు సంఘము ఎన్నటికినీ నాశనము కాదని ఆయన వాగ్దానము చేసెను. అందువలన బైబిలు ద్వారా తన సంఘమును అబద్ధ బోధకుల నుండి దేవుడు సంరక్షించుచున్నాడు. బైబిలును చదువుట ద్వారా క్రీస్తు రాజ్యము, క్రీస్తు శరీరము, దేవుని గృహము మొదలగు పదములన్నియును క్రీస్తు సంఘమును వర్ణించుటకు వయోగింపబడినవని మనము ఈనాడు గమనించి యుంటిమి.

క్రీస్తు మనకు రాజైయున్నాడు గనుక

మన పాపములను క్షమించు అధికారము ఆయన కలిగియున్నాడు. మనము ఆయన శరీరమందున్న యెడల ఆయన రక్తము మనకు జీవమును, పరిశుద్ధతను అనుగ్రహించును. మనము క్రీస్తు సంఘమందున్న యెడల మనము దేవుని బిడ్డలము. అందువలన నిత్య జీవమును పొందుటకు వారసులము. నీవు క్రైస్తవుడవు కాని యెడల క్రీస్తు ద్వారా దేవుడిచ్చు దీవెనలను పొందలేవు. పాప క్షమాపణను, నిత్యజీవమును యేసుక్రీస్తు తన సంఘము ద్వారా అనుగ్రహించు చున్నాడు. నాయొద్దకు రండి, నేను మీకు విశ్రాంతిని కలుగజేతున అని యేసు చెప్పుచున్నాడు.

మీరు యేసునందు విశ్వాసముంచి, మీ పాపముల విషయమై మారుమనస్సు పొంది, ఆయన నామమును ఒప్పుకొనుచూ, బాప్తిస్మమును పొందిన యెడల ఆయన తప్పక తన సంఘమందు, తన రాజ్యమందు ఈనాడే మిమ్మును చేర్చును. అప్పుడు ఆయన యిచ్చు దీవెనలన్నియును మీవి, మీరు ఆయనవారు అవుదురు.

జాషువా గూటం.....

*****

# సాతానుని ఆరంభము పతనము

## (The Origin & fall of satan)

ఏదెను వనమునుండి ఈ లోకాంతము వరకు మానవుని కున్న గడ్డ శత్రువు క్షయ, కేన్సరు, కుష్టు రోగము, మరణము కాదుగాని, మానవుని శత్రువు అపవాది ! సాతానుడు నిజముగా యున్నాడు. త్రిత్వమైయున్న దేవుని తరువాత ప్రముఖమైన వ్యక్తి అపవాదియని మనము ఎరుగవలెను.

అపవాది ఎక్కడ నుండి వచ్చాడు ? అతడెట్లు ఆరంభమయ్యాడు ? అపవాదిని దేవుడు సృజించాడా ? అట్లయితే ఒక దుష్ట శక్తిని ఆయన ఎట్లు చేయుగలిగాడు ? అనే ప్రశ్నలను సత్యవాణి శ్రోతలలో కొందరు మాకు వ్రాసియున్నారు.

అనేకమంది బైబిలు వేత్తలు అపవాదిముందు ఒక దేవదూతగా సృష్టింపబడెనని నమ్ముదురు. అతడు ముందు మంచి దేవదూతయే అయినను తరువాత దుష్టునిగా తయారయ్యెను. ఇది బైబిలును బట్టి నమ్మతగినదని నాయభిప్రాయము. "సాతాను మెరుపు వలె ఆకాశము నుండి పడుట చూచితిని" అని లూకా 10:18లో యేసు చెప్పెను. సాతానుడు దుష్టునిగా తయారుకాకముందు అతడు యధార్ధవంతునిగా సృజింపబడెనని మనము గ్రహించుకొనవలెను. "నీవు నియమింపబడిన దినము మొదలుకొని పాపము నీయందు కనబడు వరకు ప్రవర్తన విషయములో నీవు యధార్ధవంతుడవుగా ఉంటివి" యని యెహెజ్కేలు 28:15లో వ్రాయబడి యున్నది. అపవాది ముందు యదార్ధ వంతుడైన దేవదూతగా సృష్టింపబడెను. గనుక అతడు ఆదిలో దేవునిచే సృష్టింప బడినను యధార్ధవంతుడై యుండెనని మనము గ్రహించు కొనవలెను. అతడు ముందు పాపము లేనివాడుగా సృజింప బడెను. అతడు పరిశుద్ధత కలిగి నైతికముగా యధార్ధవంతుడై యుండెను. అతడట్లు ఎంతకాల ముండెనో మనకు తెలియదు.

అపవాది సంపూర్ణ సౌందర్యము గలవాడై యుండెను (యెహెజ్కేలు 28:12). "దేవుని తోటయగు ఏదెనులో నీవుంటివి. మాణిక్యము గోమేధికము సూర్యకాంత మణి రక్తవర్ణపురాయి సులిమానిరాయి మరకతము నీలము పద్మ రాగము మాణిక్యము అను అమూల్య రత్నములతోను బంగారము తోను నీవు అలంకరింపబడియున్నావు" అని యెహెజ్కేలు 28:13 లో వ్రాయ బడియున్నది.

మానవుని గడ్డ శత్రువు చాల తెలివిగలవాడుకూడ. అతడు పూర్ణ జ్ఞానమును సౌందర్యమును కలిగి యుండెను. చివరకు అతడు తన సౌందర్యమును గూర్చి గర్వాంధు డాయెను. నీ సౌందర్యము చూచుకొని నీవు గర్వించినవాడవై నీ తేజస్సు చూచుకొని నీ జ్ఞానమును చెరుపు కొంటివి. కావున నేను నిన్ను నేలను పడవేసెదను. రాజులు చూచు చుండగా నిన్ను హేళన కప్పగించెదను" అని యెహెజ్కేలు 28:17 లో వ్రాయ బడియున్నది. సాతానుడు ఒకప్పుడు అభిషేకము పొందిన కెరూబువలెయుండి ఒక ఆశ్రయముగా యుండెను

(14 వచనము). "దేవుని పవిత్ర పర్వతము మీద అతడు ఉండెను. కెరూబులు దేవుని సింహాసనముపై ఆశ్రయముగా యెండెడివి. కెరూబులు ప్రాముఖ్యముగా ఆశ్రయముగా యుండుటయో, దేనినైనా కాపాడుటయో జరిగించు దూతలు. ఆదాము హవ్వలను ఏదెనునుండి దేవుడు వెళ్ళగొట్టిన తరువాత కెరూబులను అక్కడ కాపలాయుంచెను (ఆది 3 : 24). మోషే నిర్మించిన ప్రత్యక్ష గుడారములో అతిపరిశుద్ధ స్థలములో మందసము మీద బంగారముతో చేయబడిన రెండు కెరూబుల ప్రతిమలుండెడివి (నిర్గమ 25 : 22). కెరూబులను గూర్చి మనము ఇంకా తెలిసికొనవలెనంటే యెహెజ్కేలు 10:1-22, ప్రకటన 4:8-11 లను చదువుట మంచిది.

ఇన్ని శ్రేష్ట లక్షణములను, దేవుని సన్నిధిలో యుండు తరుణమును కలిగియున్నను దుష్టత్వము లూసిఫరులో (యెషయా 14:12) కనబడెను. పాపమువలన సాతానుకు ఏమి సంభవించెనో యెహెజ్కేలు 28:16 తెలియజేయుచున్నది. దేవుని పర్వతము మీద నీవుండకుండ నేను నిన్ను అపవిత్ర పరచితిని. ఆశ్రయముగా ఉన్న కెరూబూ కాలుచున్న రాళ్ళమధ్యను నీవికను సంచరింపవు, నేను నిన్ను నాశనము చేసితిని.

సాతానుడు ఎందుకు పడిపోయెనో యెహెజ్కేలు మనకు తెలియజేసి యున్నాడు గాని అతడెట్లు పడిపోయెనో యెషయా మనకు వర్ణించుచున్నాడు. సాతానుడు లూసిఫరు అను పదముతో ఇంగ్లీషు బైబిలులో యెషయా 14 : 12లో ఒక్కసారి మాత్రమే సంబోధింపబడి యున్నట్లు మనము గమనించగలము. యెషయా ఇట్లనుచున్నాడు : "తేజో నక్షత్రమా, వేకువ చుక్కా, నీ వెట్లు ఆకాశము నుండి పడిపోతివి? జనములను పడగొట్టిన నీవు నేలమట్టము వరకు ఎట్లు నరక బడితివి? నేను ఆకాశమున కెక్కిపోయెదను. దేవుని నక్షత్రములకుపైగా నా సింహాసనమును హెచ్చింతును. ఉత్తర దిక్కున నున్న సభాపర్వతము మీద కూర్చుందును, మేఘమండలము మీదికెక్కుదును, మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును అని నీ మనస్సులో అనుకొంటివిగదా. నీవు

పాతాళమునకు నరకములో ఒకమూలకు త్రోయబడితివే" (యెషయా 14 : 12-15).

అపవాదియొక్క పతనమునకు కారణమైన తన అహంకార గుణము 5 విధములుగా ఈ వచనములో మనకు కనబడుచున్నది. మొదటిగా సాతానుడు "నేను ఆకాశమున కెక్కిపోయెదను" అని యనుకొనెను. అపవాదియొక్క స్వాపుస్థ్యములో అతడు దేవుడు నివసించు మూడవ ఆకాశములో పరలోకములో నివసించ వలెనని యను కొన్నట్లు అగపడుచున్నది. (2 కొరింధి 12 : 1-4). దేవదూతల నివాసస్థలము మూడవ ఆకాశము కంటె కొంచెము క్రిందయున్నట్లు తెలియు చున్నది. క్రీస్తు పరలోకమున కెక్కి పోయినప్పు డాయన "ఎంతో హెచ్చుగా పరలోకమందు ఆయనను (దేవుడు) తన కుడిపార్శ్వ మున కూర్చుండబెట్టెను అని వ్రాయబడియున్నది" (ఎఫెసీ 1:20, 21). సాతానుడు మిగతా దూతలతో నివాసము చేయుచున్నను దేవుని పర్వతముపైకి వెళ్ళే అవకాశము కలిగియుండినందున, దేవుడు తనకిచ్చిన స్థానముకంటె ఉన్నతమైన స్థానము నందుండవలెనని తలంచి తన్ను తాను హెచ్చించుకొనగోరెను. పర లోకములో అత్యున్నత స్థానము నతడు సంపాదించు వరకు సాతానుడు సంతృప్తి జెందగోర లేదు.

రెండవదిగా. "దేవుని నక్షత్రము లకు పైగా నా సింహాసనమును హెచ్చిం తును" అని సాతానుడు అనుకొనెను. యోబు 38:7 లో దేవుని నక్షత్రములను గూర్చి మనము చదువగలము. అవి నిర్జీవ గ్రహములే అయినను దేవుని మహిమను అవి ప్రతిబింబించును (కీర్తన 19:1). యోబు 38:7లో "ఉదయ నక్షత్రములు ఏకముగా కూడి పాడినప్పుడు దేవదూత లందరును ఆనందించి జయధ్వనులు చేసినప్పుడు... నీవెక్కడ ఉంటివి?" యని వ్రాయబడియుండుట మనము చూడగలము. ఈ వచనములో ఉదయనక్షత్రములు దేవదూతలు రెండూ సమానముగా వాడబడిన పదములని మనము గమనించగలము. అందువలన సాతానుడు దేవుని దూతలందరిపైనను దూతల లోకముపై నను అధిపతిగా యుండగోరెను. అతడు దేవుని ప్రధాన దూతయగు మిఖాయేలు

పైనను, గబ్రియేలు పైనను అధిపతిగా యుండగోరెను.

మూడవదిగా, ఆ మహావంట సర్పము 'ఉత్తర దిక్కున నన్ను సభాపర్వతముమీద కూర్చుందును" అని యనుకొనెను. ఇక్కడ చెప్పబడిన పర్వతము భూమిపై దేవుని ప్రభుత్వ ఆసనమును సూచించుచున్నది (యెషయా 2:1-4). తానొక సభను లేక సమాజమును గూర్చి కూడ అతడు ఆలోచించినట్లు మనము కనుగొనగలము. ఈ సభ పాతనిబంధన కాలములో ఇశ్రాయేలీయులను, ప్రస్తుత కాలములో సంఘమును సూచించుచున్నది. "ఉత్తర దిక్కున మహారాజు పట్టణమైన సీయోను పర్వతము" నుండి మెస్సీయ తన ప్రజలను పాలించునని కీర్తన 48:2లో చెప్పబడినది. సంఘము సీయోనను కొండకు జీవముగల దేవుని పట్టణమునకు, పరలోకపు యెరూషలేమునకు సారూప్యముగా యున్నది యని హెబ్రీ 12 : 22ను బట్టి మనము తెలిసికొనగలము. దీనినిబట్టి సాతానుడు మన ప్రభువైన యేసుక్రీస్తు రాజ్యముపై లేక సంఘముపై ప్రభుత్వము చేయ తలపెట్టెనని అర్థమగుచున్నది.

నాలుగవదిగా సాతానుడు నేను "మేఘ మండలము మీది కెక్కుదును" అనియనుకొనెను. నిర్గమ 16:10లో ఇట్లు వ్రాయబడియున్నది. "అట్లు అహరోను ఇశ్రాయేలీయుల సర్వ సమాజముతో మాటలాడుచుండగా వారు అరణ్యమువైపు చూచిరి. అప్పుడు మేఘము ప్రత్యక్షపు గుడారమును కమ్మగా యెహోవా తేజస్సు మందిరమును నింపెను అని నిర్గమ 40:34లో మనము చదువగలము. "యాజకులు పరిశుద్ధ స్థలములోనుండి బయటికి వచ్చినప్పుడు మేఘము యెహోవా మందిరమును నింపెను. కాబట్టి యెహోవా తేజో మహిమ యెహోవా మందిరములో నిండుకొనగా ఆ మేఘమున్న హేతువుచేత యాజకులు సేవచేయుటకు నిలువలేకపోయిరి అని 1 రాజులు 8:10, 11లో మనము చదువగలము. మత్తయి 24:30లో యేసు ప్రభువు ప్రభావముతోను, మహామహిమతోను, ఆకాశమేఘములతోను మరల వత్తునని వాగ్దానముచేసి యుండుట మనము గమనించగలము. పాత క్రొత్త నిబంధనలలో దేవుని ఉనికి తనప్రజలతో యున్నట్లు సూచించుటకు మేఘములు ఉపయోగింప బడెను.

మేఘములు దేవుని మహిమను తెలియజేయుచున్నట్లుకూడ మనము గమనించగలము. నేను మేఘ మండలము మీదికెక్కుదును. అని సాతానుడు తలంచుటలో దేవునికంటె ఎక్కువ ఘనత మహిమ ప్రభావములను తానే పొందగోరెను.

చివరిగా "మహోన్నతునితో నన్ను సమానునిగా చేసికొందును'' అని సాతానుడు ప్రకటించెను. తానే దేవుని వలె యుండుటకు, దేవుడై యుండుట కున్న తన ఆశను సాతానుడు ఇక్కడ వ్యక్తపరచుచున్నాడు. అయినను సృష్టింపబడిన దేదియు యెహోవా దేవునివలె యుండలేదని అతడెరుగును. మహోన్నతునివలె యుండుటకు సాతానుడు కాంక్షించెను. మహోన్నతుడు అనగా ఆకాశమునకును భూమికిని సృష్టికర్తయు సర్వోన్నతుడును అనియర్థము (ఆది 14 : 19, 22). అందును బట్టి సాతానుడు ఇహమందును పరమందును సర్వాధికారమును సంపాదింతునని అనుకొనెను. అందువలన సాతానుడు ఈ విశ్వమంతటికిని ఫరోవలెను, హేరోదువలెను, కైసరువలెను హిట్లరు వలెను, అట్టి వారనే కులవలెను యుండగోరెను. అహంకార దృష్టి నేను, నాకే యను స్వభావము తనలో యుండి తిరుగుబాటు చేయించెను. దేవునిని దేవుని సింహాసనము నుండి తొలగించ ప్రయత్నించినది. మహాకుయుక్తిగల ఆత్మ, అపవాది. అతడు దేవుని నారాధించుటకు బదులు తానే ఆరాధింపబడగోరెను. అందువలన దేవునికుమారుడైన యేసుక్రీస్తును శోధిస్తూ "నీవు నాకు సాగిలపడి నమస్కారము చేసినయెడల ఈలోక రాజ్యములన్నిటిని వాటి మహిమను నీకిత్తునని ఆయనకు వాగ్దానము చేసెను. (మత్తయి 4 : 8,9). అతడు పాతాళమునకు పడద్రోయబడినను తన పాత స్వభావమును మరచిపోలేదు. దేవునిచే ఆరాధింపబడగోరు అహంకార ఆత్మ యతుడు. "ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రమే సేవింప వలెను అని వ్రాయబడి యున్నదని" యేసు అతనికి బుద్ధిచెప్పి అపవాదిని జయించెను.

అహంకారమువలన అపవాది పాపి ఆయెను. అబద్ధికుడు అబద్ధమునకు జనకుడు ఆయెను. ఇప్పటికింకను

ప్రజలలో అహంకార దృష్టిని కల్పించిదేవుని వాక్యమునకు వారు లోబడకుండ అపవాది ప్రయత్నము చేయుచున్నాడు, అయితే అపవాదిని, వాని క్రియలను లయము చేయుటకే యేసుక్రీస్తు ప్రత్యక్షమాయెను (1 యోహాను 3 : 8), యేసు చనిపోయి తిరిగిలేచి అపవాదికున్న మరణ బలమును సహా బలహీనపరచెను. యేసుక్రీస్తు నందు విశ్వసించినవారు, తమపాపములపై తిరుగుబాటు చేసినవారు, క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన వారు అపవాదిని జయించన వారు. అయితే వారి పోరాటము చివరివరకును కొనసాగుచునే యుండును. ప్రతి క్రైస్తవుడు దేవుని వాక్యమునుబట్టి నమ్మకముగా యున్న యెడల అపవాది వారి నుండి పారిపోవును (యాకోబు 4:7). నీవు అపవాదిని జయించ గోరుచున్న యెడల ఈనాడే క్రీస్తును నమ్ముకొని బాప్తిస్మము పొందుము. ప్రభువు తగిన సహాయమును నీకుత్తప్పక అనుగ్రహించును.

❋❋❋❋❋

# లోకము యొక్క ఉప్పు

## (The Salt of the Earth

(మత్తయి 5:13)

మన ప్రభువైన యేసు నరావతారిగా ఈ భూలోకంలో జీవించి యుండిన కాలంలో ఆయన కొండమీద చేసిన ప్రసంగం మనకు సుపరిచితమే. అది "మీరు లోకమునకు ఉప్పయి యున్నారు. ఉప్పు నిస్సారమైతే అది దేనివలన సారము పొందును ? అది బయట పారవేయబడి మనుష్యుల చేత త్రొక్కబడుటకే గాని మరి దేకిని పనికి రాదు." (మత్తయి 5:13)

ఉప్పు అన్ని కాలములలోను, అన్ని దేశములలోను, ప్రజలందరిచేత సర్వ సాధారణముగ వాడబడు పదార్థము. మోషే ధర్మశాస్త్ర కాలములో జనులు తమ భూమి పంటలో ప్రథమ ఫలములను దేవునికి అర్పించునపుడు ఉప్పును కూడ అర్పించుచుండెడివారు. ఉప్పు, బంగారము కంటె కూడ ఎక్కువ విలువైనదిగా ఆ దినములలో ఎంచ బడేది. ఈ ఉప్పు మానవ మనుగడకు ఎంతో అవసరము

ప్రభువైన యేసు ఈ భూలోకంలో యున్నప్పుడు ఆయన తాను జీవాహారముననీ, జీవ జలముననీ, వెలుగననీ తన్నుగూర్చి చెప్పుకొనుట మనకు తెలియును (యోహాను 8:12, 6:35, 48). ఆలాగుననే ఆయనను వెంబడించే వారందరు ఉప్పువలె యుండవలెనని ఆయన చెప్పారు. (మత్తయి 5:13).

ఉప్పు జీవన మనుగడకు ఎంతో అవసరము. ప్రపంచములోని ప్రాణ కోటికందరకు అన్నికాలములలో ఉప్పు ఎంతో అవసరము. మంచి భవనాలు, మంచి సామగ్రి, బళ్లు, కారులు, విలువైన నగలు మున్నగునవి ఏమిలేకపోయిన మనము జీవించగలము. అయితే ఉప్పు అతి మిక్కిలి సామాన్యమైన పదార్థమే అయినప్పటికిని జీవించుట కది కావాలి. ఇంతమంది జీవకోటికి సరిపడిన ఉప్పును సముద్ర జలముల ద్వారా మనకు దారాళముగా దేవుడు దయచేయు చున్నాడు. ఇది 300 అడుగుల నుండి 3000 అడుగుల మందములో మనకు దేవుడు మనకు సముద్రముల ద్వారా అనుగ్రహించు చున్నాడు.

మీరు లోకమునకు "ఉప్పు" అయి యున్నారని యేసు చెప్పిన దాని భావము పదార్థములు చెడిపోకుండా నిల్వ యుంచుట కొరకు మనము ఉప్పును ఉపయోగించుదుము. ప్రస్తుత దినములలో ఆహార పదార్థములను నిలువ యుంచుకొనుట కొరకు మనము శీతలీకరణ సాధనము(Refregirator) నుపయోగించు చున్నాము. అదిలేని దినములలో మాంసము మున్నగు పదార్థములను ఉప్పు కలిపిగాని, ఉప్పుద్రావణములో ముంచిగాని నిల్వాయుంచేవారు. దేవుని బిడ్డలైనవారు ఉప్పువలె యుండవలెనని యేసు చెప్పారు. ప్రస్తుత ప్రపంచం పాపముతో నిండి యున్నది. ఆహారపదార్థములలో ఉప్పు లేనిచో ఆ లోటు వెంటనే మనకు తెలియును. ఆలాగుననే క్రైస్తవుడు లేని లోటును ప్రపంచం గుర్తించ గలిగేలాగ మనము జీవించాలి. ఆయన చిత్తమును నెరవేర్చుట మన బాధ్యతయై యున్నదని మనము మరువరాదు. ఆయన మన ద్వారా పనిచేయును. దేవుని ప్రణాళికలో మానవుడు ఎప్పుడూ ఉంటాడు. 1. ఫిలిప్పును ఐతియోపీయుడైన నపుంసకుని యొక్క మార్పు విషయములో దేవుని యొక్క ఉప్పుగా దేవుడు వాడుకొనెను. (అపో.కా 8:26-39), 2. కొర్నేలి యొక్క

మార్పు విషయములో పేతురును వాడుకొనెను. (అ॥ 10 : 1-48) 3. అపొస్తలుడైన పౌలు ఈవిధంగా చెప్పు చున్నాడు. బలహీనులను సంపాదించు కొనుటకు బలహీనులకు బలహీనుడ నైతిని. ఏవిధము చేతనైనను కొందరిని రక్షింపవలెనని అందరికి అన్నివిధముల వాడనై యున్నాను. (1కొరింథి 9:22). నీతి జనములు ఘనతకెక్కుటకు కారణము. పాపము ప్రజలకు అవమానము తెచ్చును (సామెతలు 14 : 34). క్రైస్తవుని యొక్క ఉనికి ద్వారా ప్రజలు పాపమునకు భయపడునట్లు చేయును.

ఉప్పుదాహమును కలిగించును. "నీతికొరకు ఆకలి దప్పులు గలవారు ధన్యులు వారు తృప్తి పరచబడెదరు. (మత్తయి 5:6). ఈ దినములలో అనేకులు క్రైస్తవులుగ మారుచున్నారు. దానికి కారణం విశ్వాసులైన అనేక క్రైస్తవ జీవితములను చూచి వారు ప్రోత్సహింపబడుచున్నారు. ఆసక్తి కలిగి యున్నారు. క్రైస్తవులైనవారు వారి పనులలో నమ్మకత్వము, యదార్థత, ఇరుగు పొరుగు వారి యెడల చూసే ప్రవర్తన విధానము నీతి, నియమములు మున్నగునవి ప్రజలు ఆకర్షితులగునట్లు చేయును. కొంచెము ఉప్పు దాని ఉనికిని తెలియజేయు రీతిగ మన క్రైస్తవ జీవితములుండాలి.

మూడవదిగ ఉప్పు మన ఆహారములో ఒక భాగము. వేసవిలో చాలామంది అలసట నుండి తప్పింపబడుటకు ఉప్పు మాత్రలు (Salt Tablets) వాడుదురు. క్రైస్తవునికి దేని విషయములోను అలసట, భయము లేదు. మరణభయము లేదు. తీర్పు భయము లేదు. దేవుడే వారిని గూర్చి శ్రద్ధ తీసుకుంటాడు. క్రైస్తవునికి పునరుత్థాన నిరీక్షణ యున్నది. మనము లోకమునకు ఉప్పు అయి దేవుడను గ్రహించే విశ్రాంతిని గూర్చి ప్రజలకు తెలియపరచాలి. ప్రయాసపడి భారము మోసి కొనుచున్న సమస్త జనులారా, నా యొద్దకు రండి, నేను మీకు విశ్రాంతి కలుగజేతును. (మత్తయి 11:28). కాబట్టి దేవుని ప్రజలకు విశ్రాంతి నిలిచియున్నది. (హెబ్రీ 4:9). ప్రభువు సముఖము నుండి విశ్రాంతి కాలములు వచ్చునట్లు (అపొ.కా. 3:19)

నాల్గవదిగ ఉప్పు శుద్ధిచేయును. రోమీయులు అన్నిటిలోను ఉప్పు పరిశుద్ధమైనదని చెప్పుదురు. అది పవిత్రములైన సూర్యుని నుండి

సముద్రము నుండి కలుగుతుంది. గనుక ఉప్పును పరిశుద్ధమైనదిగ ఎంచుదురు. క్రైస్తవులు హృదయ శుద్ధి కలిగి యుండాలి. (మత్తయి 5:8) హృదయ శుద్ధి గలవారు ధన్యులు. వారు దేవుని చూచెదరు. అపొస్తలుడైన పౌలుతిమోతికి నీవు పవిత్రుడవుగ యుండునట్లు చూచుకొనుమని వ్రాయుచున్నాడు. (తిమోతి 5:22). మీ మనస్సులను పవిత్ర పరచుకొనిన వారై యుండాలని 1పేతురు 1:22లో చెప్పబడియున్నది. మనతలంపులు, చేయు పనులు యెల్లప్పుడు దేవునికి మహిమకరముగ యుండునట్లు క్రైస్తవులు జాగ్రత్తపడవలెను. అవి పరిశుద్ధముగ యుండాలి.

ఉప్పు సుగంధము వంటిది. క్రైస్తవుడు, క్రైస్తవ్యము అట్టి సుగంధమును కలిగి యుండునట్లు చూచుకొనవలెను. క్రీస్తు ప్రభువును మన జీవితములోనికి చేర్చుకొనిన యెడల అట్టి సుగంధ పరిమళముగ మన జీవితములుండును. క్రీస్తు లేని జీవితము నిస్సారముగను, విసుగు కలిగించునట్లును ఉండును. అందుచే చాలామంది మత్తు పానీయములకు బానిసలైపోవుచున్నారు. వారి జీవితములు దుర్భరం అవుచున్నవి. క్రైస్తవులు యెల్లప్పుడు ఆనందించే వారుగ ఉండాలి (1థెస్స 5:16).

ఉప్పు సులభముగ లభించునదైనప్పటికిని దాని అవసరము, విలువ ప్రాముఖ్యత యెంతో గొప్పవి. నశించిన దానిని వెదకి రక్షించుటకు మనుష్య కుమారుడు వచ్చెనని యేసు చెప్పుచున్నారు (లూకా 19:10). ఆయన ఆలాగు చేసారు. మనుష్య కుమారుడు పరిచారము చేయించుకొనుటకు రాలేదు గాని, పరిచర్యచేయుటకు వచ్చి, అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగ తన ప్రాణము నర్పించెనని మనకు తెలియును. క్రైస్తవులైన వారందరు ఇట్టి గొప్ప మాదిరినను నరించాలి. అపొస్తలుడైన పౌలు కూడ ఇట్లు చెప్పుచున్నాడు. "కాబట్టి నాకు కలిగినది యావత్తు మీ ఆత్మలకొరకు బహు సంతోషముగ వ్యయపరచెదను. నన్ను నేను వ్యయ పరుచుకొందును". (11 కొరింధి 12:15) లోకమునకు ఉప్పయి యున్న క్రైస్తవులందరు అన్ని సమయములలో పనిచేయుటకు సంసిద్ధులుగా యుండాలి. దేవుని కృపతో ప్రేమతో మనము నిరంతరము పెరుగు చున్నట్లయిన ఆలాగు చేయగలము.

అఖరిగా ఉప్పు తన సారమును పోగొట్టుకొనును. అనగా దాని బలము, రుచిసారము అన్నమాట. క్రైస్తవుడు క్రీస్తు ప్రేమ నుండి తొలగి ఇహలోక సంబంధవిషయములలో పాలివాడై నప్పుడు అతడు తన నైతిక జీవితమునుండి దిగజారి పోవును. అట్టి క్రైస్తవులు లోకమును ప్రభువు తట్టు ఆకర్షించుటలో శక్తిహీనులగుదురు. నిస్వార్ధబుద్ధి కలిగి అనేకులను రక్షణ మార్గములోనికి నడిపించుటకు క్రైస్తవులు యెల్లప్పుడూ ప్రయత్నించుచూ, పనిచేయుచూ యుండి మన రక్షకుడైన యేసు ప్రభువు యొక్క సారము కలిగియుండాలి. ఆవిధముగా క్రైస్తవులమైన మనము ఉండవలెననిన ఉప్పువంటి విశ్వాస సారము కలిగి యుండాలి. మీరు లోకమునకు ఉప్పు వంటి వారైయున్నారని ప్రభువు చెప్పిన మాటనుబట్టి ఆయన బిడ్డలమైన మనమందరము ఆయనను బట్టి ఉప్పు సారము పొందియే యున్నాము. కనుక మనము మన సారమును పోగొట్టుకొనక లోకమునకు ఆ ఉప్పుసారమును అందించే వారముగ యుండుటకు మన జీవితములను మలచుకొని దేవుని పనిలో, సేవలో అంకితము కాగలుగునట్లు తీర్మానించుకొందము.

జెస్సీ సలోమి...

# సామెతల గ్రంధములోని బెత్తము

బాలల తిరస్కారం (Child Abuse) ఒక ప్రక్క క్రమశిక్షణ నిర్లక్ష్యం ఒక ప్రక్క జరుగుతున్న ఈ రోజులలో సామెతల గ్రంథములోని బెత్తమును కొందరు పాతవద్ధతైపోయిందిగా తలంచుతారు. ఈ వ్యాసమును బాగుగా పరిశీలించి నీవు అంగీకరిస్తావేమో చూడు.

బెత్తమును గురించిన సొలొమోను మాటలు అర్ధంచేసికోవాలేగాని తప్పుగా అన్వయించకుండడమే పరిష్కారం.

తన కుమారుని ప్రేమించు తండ్రి అతనిని "జాగ్రత్తగా" "క్రమపరచును" (సామెతలు 13:24). బెత్తమును పట్టుకొనిన చేయి ప్రేమించి క్రమ పరచే హృదయానికి చెందినది. (హెబ్రీ ఆహాబ్

- ఒకని స్వంత ప్రాణమును ప్రేమించుట, ఊపిరిలాంటి కోరిక) క్రమ శిక్షణ హెబ్రీ ముసార్ గురిదిద్దు, గద్దింపు, మాదిరి, బోధింపకలిగినది) జాగ్రత్తగా జరిగినది. (హెబ్రీ షాచర్ - వెతుకుటకు, జాగ్రత్తగా గద్దించుట, దానికొరకు ఆశ) ఆ చేతిలోని బెత్తము, ఆ హృదయము తాను బాల్య తిరస్కారము చేసితినని నేరస్థాపన కలిగియున్నదా ? ఎప్పటికి లేదు ! సొలొమోను ఎంతచక్కని దైవ నడిపింపు కలిగిన క్రమశిక్షణను గురించిన మాదిరిని మనకు ఇచ్చాడు కదా !

బెత్తము ఇంకను దేవుని వాక్యములో ఉందని గుర్తుంచుకో. సామెతలు 22:15లోని ఆ బెత్తము (హెబ్రిఐవిలెత్ - దుర్మార్గత, అధికారము) బాలుని హృదయంలోని మూఢత్వమును తొలగించును. మన సమాజమునకు ఇంకా ఆ బెత్తము అవసరత ఉన్నదా ? అది సరిదిద్దని బెత్తమయితే సొలొమోను ఇచ్చిన బెత్తము కాదు.

సామెతలు 23:13 మనం శిక్షించుటకు మానకూడదని చెబుతుంది. ఇంకా ఇలా ఉంది, "బెత్తముతో వాని కొట్టిన యెడల ... వాని ఆత్మను నీవు తప్పించెదవు" (సామెతలు 23:14) హెబ్రీనట్సల్ - ప్రమాదము నుండి లాగుట, తప్పించుకొనుట) ఒక బాలుని ప్రమాదము నుండి లాగుటకు నీవు బెత్తమును వాడిన యెడల అది క్రమశిక్షణలో చెడు పద్ధతియా ? సామెతలు 29:15లో (హెబ్రీ తోకచతో - వాదించుట, చూపుట, గురియైన దానిని చేయుట, దిద్దుబాటు, శిక్ష) బెత్తము జ్ఞానము కలుగజేయుటకు గద్దింపుతో మిళితమై ఉంది. గద్దింపుతో బెత్తమును ఉపయోగించకపోయినట్లయిన సొలొమోను చెబుతున్నాడు" అదుపులేని బాలుడు తన తల్లికి అవమానము తెచ్చును" అని (సామెతలు 29:15). అట్టి అవమానముతో తల్లి/తండ్రి విడిచి పెట్టబడి ఉంటే ఎంతటి మూల్యం చెల్లించబడిందో కదా ! (హెబ్రీ బోష్ ఆశ్చర్యపడి, సందిగ్ధపడి, నిమ్మళించి, భయపడి పాలిపోయి, ఆశలేకపోవడం, ఊహించలేని వేదనతో కూరుకుపోవడం)

గుండెను పిండే అట్టి ఆవేశాలను తొలగించే బెత్తము, గద్దింపు అవసరం మాత్రమే కాదు ప్రాముఖ్యం కూడా.

క్రమ పరచే బెత్తము చేతనుండగా ప్రేమగల హృదయం నుండి జ్ఞానము కలిగించే గద్దింపు మాటలద్వారా

ఖచ్చితంగా దేవుడు సొలొమోనుద్వారా క్రమశిక్షణకు మంచి సూచికలను అందించాడు.

హాయిమ్‌గినోట్ ఈ విషయాని పరిశీలించాడు.

తాతయ్య ఏదిచేసినా అధికారంతో చేసాడు.

మనము ఏది చేసినా అనుమానంతోను చేస్తాము.

తాతయ్య తప్పుచేసినా ఒప్పు అన్నంత ధీమాగా ఉంటాడు.

మనము ఒప్పు చేస్తున్నా అనుమానంతోనే పనిచేస్తాము. అని సొలొమోను సలమాలను బాలునికి ఉపయోగించువాడు మంచి వాడుగా ఎదుగుతాడు.

డేటన్ కిస్సీ...

*****

# సహస్రాబ్ది స్వామ్యం

(గత సంచిక తరువాయి)

**రాజ్యస్థాపనకు అనువైన కాలము**

"అందుకాయన - మీరైతే నేను ఎవడనని చెప్పుకొనుచున్నారు. అని అడిగెను. అందుకు సీమోను పేతురు - నీవు సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తువని చెప్పెను. అందుకు యేసు - సీమోను బర్యోనా, నీవు ధన్యుడవు. పరలోకమందున్న నా తండ్రి ఈ సంగతి నీకు బయలు పరచెనే గాని నరులు నీకు బయలుపరచలేదు. మరియు నీవు పేతురువు, ఈ బండమీద నా సంఘమును కట్టుదును, పాతాళలోక ద్వారములు దాని యెదుట నిలువ నేరవని నేను నీతో చెప్పుచున్నాను. పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను'' (మత్తయి 16:16-18).

''సజీవుడగు దేవుని కుమారుడైన క్రీస్తు" అనే బండవంటి వాస్తవముపై సంఘం కట్టబడాలి. క్రీస్తు దేవుని కుమారుడని ఎప్పుడు రుజువు చేయబడింది? "మృతులలో నుండి పునరుత్థానుడైనందున దేవుని కుమారుడగా ప్రభావముతో నిరూపింపబడెను'' (రోమా 1:7). పాతాళలోక ద్వారాలు ఆయన

పునరుత్థానుడు కాకుండా నిరోధించలేక పోయాయి. మరొక మాటలో సంఘం స్థాపించబడక మునుపు క్రీస్తు మృత్యుంజయుడు కావాలి అని అర్థం. ఆయన పునరుత్థానుడు కాకుండా పాతాళము అడ్డగించలేదు.

మృతుల లోకముగుండా పునరుత్థానుడగుట వలన క్రీస్తు సాతానుని సంపూర్ణముగా జయించాడు. "మీరు సిలువవేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను (రాజు) క్రీస్తుగాను (అభిషిక్తుడు) నియమించెను" (అపొ 2.36) "పరలోక మందును భూమి మీదను నాకు సర్వాధికారము ఇయ్యబడి యున్నది" (మత్తయి 28-18), అని క్రీస్తు ఉద్ఘాటించాడు. క్రీసుకు సర్వాధికార మీయబడితే, ఆయన తన రాజ్యాన్ని ఎందుకు స్థాపించలేడు? సర్వాధికారి యైన క్రీస్తు తన ఆధ్యాత్మిక రాజ్యాన్ని స్థాపించటానికి అదే, "పరిపూర్ణ సమయం" (గలతీ 4:4: అపొ. 3.21: మార్కు 1:15), సరియైన తరుణం, అనుకూల సమయం.

## రాజ్యం శక్తితో స్థాపించబడింది

"ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు, మనుష్య కుమారుడు తన రాజ్యముతో వచ్చుట చూచువరకు మరణం రుచిచూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మత్తయి 16:28). ఈ వాక్యాన్ని బట్టి క్రీస్తు యొక్క బోధలు వ్యక్తిగతముగా విన్నవారిలో కొందరు జీవించి యుండగానే రాజ్యం స్థాపించబడింది. రాజ్యం స్థాపింపబడకపోతే క్రీస్తు బోధలు స్వయముగా విన్న వారిలో కొందరు నేడు కూడ భూమి మీద యింకా బ్రతికుండాలి. "ఆయన ఇక్కడ నిలిచియున్న వారిలో కొందరు దేవుని రాజ్యము బలముతో వచ్చుట చూచువరకు మరణము రుచిచూడరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను" (మార్కు 9.1).

ఈ వాక్యప్రకారం దేవుని రాజ్యం శక్తితో వచ్చియుండాలి. "నా తండ్రి వాగ్దానం చేసినది మీకు పంపుచున్నాను. మీరు (అపొస్తలులు) పై నుండి శక్తి పొందు వరకు యెరూషలేము విడిచి వెళ్ళక నావలన వినిన తండ్రి యొక్క వాగ్దానం కొరకు కనిపెట్టుడి: మీరు పరిశుద్ధాత్మలో నిమజ్జనం (బాప్తిస్మం) పొందుదురు" (అపొ. 1:4:5).

తండ్రి వాగ్దానం పరిశుద్ధాత్మ వస్తే అపొస్తలులు శక్తిపొందుతారు: అంటే రాజ్యం శక్తితో వస్తుంది అని భావం. "ఈ

యేసునే దేవుడు లేపెను. ఆయన దేవుని కుడి పార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గూర్చిన వాగ్దానము పొంది, మీరు చూచుచు వినుచున్న దీనిని కుమ్మరించి యున్నాడు" అని పేతురు బోధించాడు (అపొ. 2.32, 33). అంటే 12 మంది అపొస్తలులు పెంతెకొస్తు దినాన్న పరిశుధాత్మ శక్తిపొందగానే క్రీస్తు రాజ్యం అద్భుతరీత్యా స్థాపించబడింది. అదియే క్రీస్తు సంఘం (అపొ. 2:1-4).

## రాజ్యము - సంఘము ఒక్కటే

1) "నేను ఈ బండమీదనా సంఘమును కట్టుదును. పరలోక రాజ్యము యొక్క తాళపు చెవులు నీకిచ్చెదను" (మత్తయి 16:18:19) అని పేతురుతో క్రీస్తు అన్నాడు. ఆకట్టేది సంఘం అయితే దానిలో ప్రవేశింపజేయు వారికి సంఘం యొక్క తాళపు చెవులివ్వాలి గాని రాజ్యం, యొక్క తాళపు చెవులిస్తానన్నాడు. అంటే రాజ్యం-సంఘం ఒకే దాన్ని సూచిస్తూ వాడబడిన పర్యాయపదాలు.

2) "దేవుని రాజ్యము మీ యొద్ద నుండి తొలగింపబడి దాని ఫలమిచ్చు జనుల కియ్యబడును" (మత్తయి 22:43) అని కీర్తనలు 118:22, 23ను ప్రస్తావిస్తూ క్రీస్తు తన రాజ్యాన్ని గూర్చి బోధించాడు. ఇదే వాక్యాన్ని పేతురు అపొ.కా.2:37లో ఎత్తి చెబుతూ సంఘములో ప్రవేశింపని యూదులను హెచ్చరించాడు. గనుక రాజ్యము, సంఘము ఒక్కటేయని నిర్ధారణ అవుతోంది. ఇది తిరుగులేని వాస్తవం, రుజువు.

3) కొలస్స పట్టణమందున్న క్రైస్తవులు ఆయన రాజ్యములో ఆయన శరీరమైన సంఘమందు యుండిరని కొలస్స 1:13, 18, 24 బోధిస్తోంది. సంఘము - రాజ్యము ఒక్కటే కానట్లయితే ఇదెట్లా సాధ్యమౌతాది?

రాజ్యం- సంఘం, రాజ్య నివాసులు - క్రైస్తవులు, రాజు - క్రీస్తు, రాజ్యాంగం క్రొత్త నిబంధన.

పి.ఐ. సల్బితి...

(మిగతా వచ్చే సంచికలో)

**గమనిక:** సత్యవాక్కు కావలసినవారు సంవత్సరమునకు 50/-రూ॥లు చందా విధిగా పంపించవలయును.

SATYA VANI, P.O. BOX - 80, KAKINADA - 533 001.

## సంక్షిప్త వార్తలు

2005 జూన్ 1,2,3, తేదీలలో కాకినాడ ఇందిరా కోలనీ (రమణయ్యపేట)లో యున్న క్రీస్తు సంఘము సువార్త మహాసభలు ఘనంగా నిర్వహించిరి. ఈ రక్షణ సువార్త మహాసభలు సర్పవరం జంక్షన్, నలంద స్కూల్ వీధిలో యున్న ఖాళీస్థలంలో నిర్వహించబడెను ప్రతిరోజు ఉదయం 9 గం॥ల నుండి రాత్రి 9 గం॥ల వరకు సభలు నిర్వహించబడెను. ఆ సభలో బ్రదర్:జి. దేవదానం, (మద్రాసు) సి. హెచ్. మణిక్యాలరావు (విశాఖపట్టణం), మజ్జి కృపారావు (విశాఖ), బి. విజయకుమార్, పి. వెంకట్రావు మరియు జాషువా గూటం గార్లు వాక్య పరిచర్య చేసిరి. ఎ. కృపానందం, చుక్కా అప్పారావు తదితర్లు ప్రార్థనలోను తదితర కార్యక్రమములలోను సహకరించిరి. ఇందిరాకోలనీ క్రీస్తు సంఘము దూరప్రాంతముల నుండి వచ్చిన వారందరికీ భోజన వసతులు కల్పించిరి. సభలకు హాజరైన వారందరు గొప్ప ఆత్మీయమేలును పొందిరి. స్థానిక సువార్తికులు పి. వెంకట్రావుగారు నిర్విరారామ కృషి చేసి ప్రార్థనాపూర్వకముగా సభలను జయప్రదముగా నడిపించి నందుకు అభినందనీయులు, కూటములలో ఇద్దరు బాప్తిస్మము పొందిరి.

తూర్పుగోదావరి జిల్లా గొల్లపాలెం క్రీస్తు సంఘము 2005 జూన్ 6, 7, 8 తేదీలలో సువార్త బహిరంగ సభలను దిగ్విజయముగా నిర్వహించిరి. "మానవుని కొరకైన దేవుని నిత్య సంకల్పం" అను అంశముపై ఆ సభలలో సోదరులు బి. జాషువా (ఏలూరు), బి. జీవన్ (విజయవాడ) పి. భాస్కరరావ్ (నాగార్జున సాగర్), జి. సహాదేవుడు (తాడేపల్లిగూడెం), పి. జాన్‌మోజెస్ (గొల్లపాలెం), మరియు జాషువా గూటం గార్లు వాక్య పరిచర్య చేసిరి. ప్రతిరోజు ఉదయం 10గం॥లకు మధ్యాహ్నం 2 గం॥లకు బైబిల్ తరగతి నిర్వహించబడెను. రాత్రి 7గం॥లకు బహిరంగ సభ నిర్వహించబడెను. కాజులూరు మండలం అంతటా ఈ సభలను గూర్చి విస్తృత ప్రచారము గావించబడెను. అనేకులు హాజరై సత్యవాక్యమును వినగల్గిరి. సభల కన్వీనర్ పి. మణికుమార్ గారు, స్థానిక సువార్తకులు పి. జాన్ మోజెస్ గారు, స్థానిక సంఘము చేసిన గొప్ప కృషివలన ఈ సువార్త సభల ద్వారా సత్ఫలితాన్ని సాధించగల్గిరి. సోదరులు పి. విజయకుమార్, మరియు బి. సుధాకర్ గార్లు బైబిలు క్లాసులలో ఉపదేశించిరి. సభలలో సహకరించిరి.

2005 జూన్ 15, 16 తేదీలలో తూర్పు గోదావరి జిల్లా కొత్తపేటలో యున్న క్రీస్తు సంఘము నిర్వహించిన సువార్త కూటములలో సోదరులు జాషువా గూటం, మరియు యమ్. సామ్యూల్ రాజు గార్లు పాల్గొని వాక్య పరిచర్య చేసిరి. ఆ కూటములకు

పలు ప్రాంతముల నుండి వచ్చిన సువార్తికులు కూడ హాజరైరి. స్థానిక సువార్తికులు ఎస్.జె. మోహన్‌రావు గారు వారి కనిష్టకుమారుడు నవజీవన్‌బాబు కూటములను సమర్ధవంతముగా నడిపించిరి.

2005 జూన్ 22వ తేదీ బుధవారం పాలకొల్లు మండలం పూలపల్లిలో నిర్మించబడిన క్రీస్తు సంఘు ఆలయమును సోదరులు జాషువాగూటం గారు ప్రార్ధించి, రిబ్బను కత్తిరించి ప్రతిష్టచేసిరి. ఆ కార్యక్రమునకు అనేకులు హాజరై దేవుని స్తుతించిరి. పూలపల్లిలో సోదరులు యమ్. మాణిక్యరావు గారు పలు సంవత్సరముల నుండి సువార్త పరిచర్య చేయుచున్నారు.

2005 సెప్టెంబరు 15, 16, 17 తేదీలలో కాకినాడ అంబేద్కర్ భవన్‌లో బైబిల్ లెక్షర్‌షిప్ నిర్వహించబడును. స్వదేశ విదేశ సోదరులు వాక్యోపదేశము గావించెదరు. భోజన వసతులు ఉచితం. హాజరైన ప్రతివారు మూడు రోజులకు కేవలం 10/-రూ॥లు మాత్రము రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించతే చాలు, మీ అందరి ప్రార్ధనల కొరకు మా విజ్ఞాపన.

RNI Road No. 69973/98
Postal Regd. No. VM/KD/02

From :
**SATYA VAKKU**
**P.O. Box 80,**
**Kakinada - 533 001.**

To.

Edited & Published by Joshua Goutam Printed by him at
Satya Vani Publications, Sambhamurthy St. Kakinada - 533 004